సిల్వర్ మెడల్ అందుకుంటున్న సహాన్

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సహాన్ ప్రతిభ

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 16 : జాతీయ స్థాయి కరాటే కుంగ్‌పూ చాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని పాంనూర్‌కు చెందిన వంగ సహాన్ ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించాడు. దీనికి సంబంధించిన వివరాలను కరాటే మాస్టర్ పెసరు సారయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుంగ్ పూ డు చాంపీయన్ షిప్ ఓపెన్ టు ఆల్ మార్షల్ ఆర్ట్స్ స్టైల్స్ ఈ నెల 15న హైదరాబాద్ యూసఫ్‌గూడ లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. నంది అవార్డు గ్రహీత, ఉత్తమ యాక్షన్ డైరెక్టర్ పీటర్ హైన్ (ఫైట్ మాస్టర్) ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందించారని కరాటే టోర్నమెంట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు కంటేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైట్ మాస్టర్లు కార్తిక్, రాజు, పెసరు సారయ్య తదితరులు పాల్గొన్నారు.

జనగామలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

జనగామ చౌరస్తా, డిసెంబర్ 16 : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం జనగామ పట్టణంలోని కుర్మవాడ, సంజయ్ నగర్ ఏరియాల్లో చేపట్టిన ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజల ఇండ్ల స్థితిగతులను క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. సెల్‌ఫోన్‌లో నిక్షిప్తం చేసిన ప్రత్యేక యాప్‌లో దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేస్తున్నారని ఆయన వివరించారు. ఇళ్లులేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సర్వే ప్రక్రియలో భాగంగా అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తూ తప్పిదాలకు తావులేకుండా చూడాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారుకు సొంత ఇంటి స్థలం ఉందా? లేదా? ఉంటే దానికి సంబంధించిన భూమి యాజమాన్య పత్రం, ఇతర ధ్రువీకరణ పత్రాలు, అవి లేకుంటే ఇంటి పన్ను రశీదులు, తెల్ల రేషన్ కార్డు పత్రాలను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ కార్యాలయ ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి

అధికారులకు సూచనలిస్తున్న రాంబాబు

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 16 : డివిజన్ కేంద్రంలోని 132/33కేవీ విద్యుత్ ఉప కేంద్రం, విద్యుత్ నియంత్రికల మరమ్మతు కేంద్రాల్లో పరిశుభ్రతను పాటించాలని ట్రాన్స్‌కో డీఈ(ఆపరేషన్) వై రాంబాబు సూచించారు. సోమవారం విద్యుత్ ఉప కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఇక్కడికి వచ్చే వినియోగదారులు, అధికారులు, విద్యుత్ సిబ్బందికి ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడేలా పూలమొక్కలను పెంచాలన్నారు. వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని రాంబాబు తెలిపారు. విద్యుత్ చార్జీలను బకాయిలు లేకుండా చెల్లించి సహకరించాలని ఆయన వినియోగదారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ఆపరేషన్(ఇన్‌చార్జి) లక్ష్మీ నారాయణ, ఘనపూర్ టౌన్ ఏఈ శంకర్, సబ్ ఇంజినీర్ హరిత, ఫోర్‌మెన్ రాజేందర్, లైన్‌మెన్ శ్రీధర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

*I, ADDIKILA MANASA D/o ADDIKILA SRINIVAS (New Name) previously called as VANGA MANASA W/o VANGA CHAITANYA KUMAR (Old Name) and Residing at H.No.1-1-47/4, Chaitanyapuri Colony, Opp. NIT, Hanumakonda Dist-506004, TG.

NTW-000

CHANGE OF NAME

*I, VANGA NAGAMANI W/o VANGA LAXMAIAH (New Name) Previously called as SWARGAM NAGAMANI D/o JAGANNATHAM (Old Name) H.No. 1-1-47/4, Chaitanyapuri Colony, Opp. NIT, Hanumakonda Dist-506004, T.G.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

దవాఖానలో బెడ్ షీట్ల పంపిణీ

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 16 : క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని సీహెచ్‌వోగా విధులు నిర్వర్తిస్తున్న చింత వెంకటస్వామి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్‌కుమార్, గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ఫాధర్ థామస్ కిరణ్ చేతుల మీదుగా బెడ్ షీట్లను పంపిణీ చేసినట్లు వెంకటస్వామి తెలిపారు.

పోగు అశోక్

జాతీయ స్థాయి విద్యా సదస్సుకు అశోక్

కొడకండ్ల, డిసెంబర్ 16 : మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పోగు అశోక్ జాతీయ స్థాయి విద్యా సదస్సుకు ఎంపికయ్యారు. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్సీఈఆర్టీ) న్యూఢిల్లీ వారు నిర్వహించే జాతీయ విద్యా సదస్సుకు మన రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. వివిధ అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించాల్సిందిగా జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ దేశంలోని ఉపాధ్యాయులను కోరింది. ఈ నేపథ్యంలో పోగు అశోక్ సమర్పించిన పరిశోధన పత్రం హౌ టు ఎన్ హాన్స్ క్రియేటివిటి అండ్ క్రిటికల్ థింకింగ్ ఇన్ స్టూడెంట్స్ జాతీయ స్థాయి విద్యా సదస్సుకు ఎంపికైంది. వచ్చే జనవరి 2 నుంచి 4 వరకు జరిగే సదస్సుకు పోగు అశోక్ వెళ్లనున్నారు.

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



కలెక్టరేట్ ఎదుట జరిగిన దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జనగామ చౌరస్తా, డిసెంబర్ 16 : అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్‌రెడ్డి అని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు (ఎస్ఎస్ఏ) చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి ఏడో రోజుకు చేరాయి. వారికి రాజయ్య సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎస్ఏ, కేజీబీవీ ఉద్యోగులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వారికి పేస్కేల్ వర్తింపజేయాలని కోరారు. విద్యాశాఖ నియామకాల్లో వెయిటేజీ కల్పించాలని పేర్కొన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో వారు ప్రస్తావించే విధంగా చొరవ తీసుకుంటానని రాజయ్య పేర్కొన్నారు.

అన్నిరంగాల్లో కాంగ్రెస్ సర్కారు విఫలం

అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని మాజీ ఎమ్మెల్యే రాజయ్య విమర్శించారు. రైతు రుణమాఫీ పూర్తిగా అమలు చేయలేదని, రైతుభరోసాలో రైతులకు పైసా ఇవ్వలేదని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీ బస్సు ప్రయాణం తప్ప, నెలకు రూ.2500 ఇస్తామని చెప్పిన హామీ అమలు చేయలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని ఎద్దేవా చేశారు. ప్రజాపాలన పేరిట ప్రజల మీద కక్ష సాధింపు చర్యలను సీఎం రేవంత్ ప్రభుత్వం చేపడుతున్నదన్నారు. ప్రశ్నించే వారి గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. విపక్ష ప్రజాప్రతినిధుల గృహ నిర్బంధం, ముందస్తు అరెస్ట్‌లు చేస్తున్నదని ఆయన విమర్శించారు. అశోక్ నగర్‌లో నిరుద్యోగ యువకులపై లాఠీఛార్జీ చేయడం, లగచర్లలో 64 మంది రైతులను జైళ్లలో పెట్టి హింసించడం రేవంత్‌రెడ్డికే చెల్లిందని పేర్కొన్నారు. తెలంగాణ అస్థిత్వానికి ప్రతీకగా నిలిచిన తల్లి తెలంగాణ విగ్రహాన్ని మార్చి సచివాలయంలో పెట్టిన కాంగ్రెస్ తల్లి విగ్రహం బతుకమ్మ, కిరీటం లేకుండా ఉందన్నారు. గ్రామీణ దేవతల విగ్రహాలకు కూడా కిరీటాలు ఉంటాయన్న విషయం రేవంత్‌రెడ్డి మర్చిపోయారని గుర్తు చేశారు. వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాజీవ్ గాంధీ విగ్రహం స్థానంలో వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని, కాంగ్రెస్ తల్లి విగ్రహ స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేశ్, ప్రధాన కార్యదర్శి బైరగోని దయాకర్ గౌడ్, కోశాధికారి గోలి రవిందర్‌రెడ్డి, గోరంట్ల యాదగిరి, ఎండబట్ల శ్రీనివాస్, రాజ్ కుమార్, రొయ్యల రాజు, తరేశ్, కిషన్, మధు, అన్నపూర్ణ, రాధిక, మహాలక్ష్మి, సునీత, రాణి పాల్గొన్నారు.

దేవరుప్పుల, స్టేషన్‌ఘన్‌పూర్ పోలీస్‌స్టేషన్లలో ముందస్తు అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

బిల్లులు చెల్లించకుండా గొంతునొక్కుతున్న సర్కారు

ముందస్తు అరెస్ట్‌లపై మాజీ సర్పంచ్‌ల ఆగ్రహం

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 16 : గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేస్తుంటే కాంగ్రెస్ సర్కారు ముందస్తు అరెస్ట్ చేయడం సిగ్గుచేటని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తాటికొండ సురేశ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ సమస్యలపై నిరసన తెలిపేందుకు మాజీ సర్పంచ్‌లు హైదరాబాద్‌లోని అసెంబ్లీ వద్దకు వెళ్లాలని యత్నించగా ముందస్తు అరెస్ట్ చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో నాటి సీఎం కేసీఆర్ గ్రామాలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేయడంతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పేరిట సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. మాజీ సర్పంచ్‌లు లక్షలాది రూపాయలు అప్పు చేసి అభివృద్ధి పనులు చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి జీపీలకు నిధులు విడుదల చేయకుండా తనను అర్ధరాత్రి ఇంట్లో నుంచి తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్లలో ఉంచడం అన్యాయమన్నారు. ఆయన వెంట విశ్వనాథపురం మాజీసర్పంచ్ అనుమాల మల్లేశం ఉన్నారు.

దేవరుప్పలలో..

దేవరుప్పుల : మండలంలోని పలు గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినా నేటికీ సర్కారు బిల్లులు చెల్లించకపోవడంతో వారు నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు యత్నించిన వారిని అదుపులోకి తీసుకుని ఠాణా కు తరలించారు. వీరిలో మాజీ సర్పంచ్‌లు గేమానాయక్, రాజన్న, మధు, మల్లేశ్, నర్సింహులు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

జఫర్‌గఢ్, డిసెంబర్ 16 : ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని ఆయన తనిఖీ చేశారు. వార్డులను పరిశీలించి వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రాంపై ఏఎన్ఎంలతో సమీక్ష నిర్వహించి దీనిని విజయవంతం చేయాలన్నారు. సీహెచ్‌సి, పీహెచ్‌సీ సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్‌కుమార్, సీహెచ్‌సీ, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు నరేందర్, రాజమల్లు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో మల్లికార్జున్‌రావు

భూతగాదాలో ఒకరికి తీవ్ర గాయాలు

చిల్పూరు, డిసెంబర్ 16 : భూతగాదాలో సోదరులు ఘర్షణపడగా ఒకరికి గాయమైన ఘటన స్థానికంగా జరిగింది. ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగంపల్లికి చెందిన అన్నదమ్ములు కర్రె రాజు, వెంకన్న మధ్య కొంతకాలంగా భూతగాదా ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి కర్రె రాజు తన బావిదగ్గర మక్కజొన్న చెనుకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. సోదరుడు కర్రె వెంకన్న కుటుంబ సభ్యులతో కలిసి రాజుపై దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని సోమవారం చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఎంజీఎంకు దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నవీన్‌కుమార్ విలేకరులకు తెలిపారు.

జనగామ డిపోను తనిఖీ చేసిన కరీంనగర్ రీజియన్ ఈడీ

జనగామ, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ జనగామ డిపోను సోమవారం కరీంనగర్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) ఖుస్రోషాఖాన్ తనిఖీ చేశారు. బస్ స్టేషన్‌లో స్టాల్స్ సందర్శించి స్టేషన్‌లోని విచారణ కౌంటర్‌లో రిజిస్టర్లను తనిఖీ చేశారు. బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రయాణికులకు అసౌర్యం లేకుండా చూడాలని సూచించారు. అనతరం డిపో మేనేజర్ కార్యాలయాన్ని సందర్శించిన ఈడీ ఖాన్‌ను డిపో మేనేజర్ ఎస్.స్వాతి, అధికారులు, సిబ్బంది సన్మానించారు. అనంతర డిపో కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన ఖాన్ పని పెండింగ్ లేకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ ఇంజినీర్ (మెక్) రాఘవేందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ యాదమణిరావు, అకౌంటెంట్ హరిలాల్, స్టేషన్ మేనేజర్ ఎం సమ్మయ్య, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ వీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ..

బీబీనగర్‌కు చెందిన భూక్యా రాజేశ్ బస్సులో మర్చిపోయిన రూ.1.50 లక్షల బ్యాగ్‌ను నిజాయితీతో అప్పగించిన కండక్టర్ ఎం రజితను డిపో మేనేజర్ ఎస్ స్వాతి అభినందించారు. సోమవారం జనగామ నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న జనగామ డిపో బస్సులో భూక్యా రాజేశ్ తన బ్యాగును మర్చిపోయి ఉప్పల్‌లో దిగిపోయాడు. కొద్దిసేపటి తర్వాత గుర్తించిన అతడు టికెట్‌పై ఉన్న కండక్టర్ స్టాఫ్ నంబర్ ఆధారంగా ఫోన్ నంబర్ సేకరించి బస్సులో బ్యాగ్ మర్చిపోయినట్లు కండక్టర్‌కు సమాచారం దీంతో రూ.1.50 లక్షల నగదుతో ఉన్న బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని హైదరాబాద్ జేబీఎస్‌లో అక్కడి అధికారులు, పోలీసుల సమక్షంలో ప్రయాణికుడికి అందజేశారు.

గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలి : కలెక్టర్

బాలికలతో కలిసి వాలీబాల్ ఆడుతున్న షేక్‌రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, డిసెంబర్ 16 : క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం జనగామ పట్టణంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో నిర్వహించిన సీఎం కప్-2024 జిల్లా స్థాయి క్రీడలకు ముఖ్య అతిథిగా కలెక్టర్, విశిష్ట అతిథులుగా వెస్ట్‌జోన్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున హాజరై ప్రారంభించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, బేస్ బాల్ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. కలెక్టర్ షేక్‌రిజ్వాన్ బాషా మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. అనంతరం క్రీడాకారులతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ బ్యాడ్మింటన్, వాలీబాల్, బేస్ బాల్ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వెంకట్‌రెడ్డి, రాకేశ్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా శ్రీలత

దేవరుప్పుల, డిసెంబర్ 16 : చేనేత ఐక్యవేదిక మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా మండలంలోని కడవెండికి చెందిన దుడికి శ్రీలతను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ సోమవారం ఆమెకు నియామక పత్రాలు అందజేశారు. శ్రీలత విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పద్మశాలి మహిళల శక్తిని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు పరమేశ్వర్ పాల్గొన్నారు

ముగిసిన గ్రూప్-2 ప్రవేశ పరీక్ష

రెండో రోజు ఉదయం పరీక్షకు 2577 మంది, మధ్యాహ్నం 2579 మంది అభ్యర్థుల గైర్హాజర్

జనగామలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి అభ్యర్థులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా

పరీక్షా కేంద్రం వద్ద ఎస్సైకి తన సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

నగామ చౌరస్తా, డిసెంబర్ 16 : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గ్రూప్-2 ప్రవేశ పరీక్ష జిల్లాలో రెండో రోజు విజయవంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 (ఎకానమీ అండ్ డెవెలప్‌మెంట్), మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-4 (తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్) పరీక్ష జరిగింది. జిల్లా కేంద్రంలో (యశ్వంతాపూర్‌తో సహా) ఏర్పాటు చేసిన 16 పరీక్ష కేంద్రాల్లో పురుష అభ్యర్థులు 3094, మహిళా అభ్యర్థులు 2376 మంది కలిపి మొత్తంగా 5470 మంది పరీక్ష రాయాల్సి ఉంది. కాగా, ఉదయం జరిగిన పరీక్షకు 2893 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం పరీక్షకు 2891 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 2577 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం పరీక్షకు 2579 మంది అభ్యర్థులు గైర్హాజర్ అయ్యారు. ఉదయం పరీక్షకు 52.89, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 52.85 హాజరుశాతం నమోదైంది. పరీక్ష సమయానికన్నా అరగంట ముందే సంబంధిత అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించారు.

పోలీస్ బాస్ అయినా రూల్స్ పాటించాల్సిందే..

'పోలీస్ బాస్ అయినా నిబంధనలు పాటించాల్సిందే' అనడానికి జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన గ్రూప్-2 పరీక్ష కేంద్రం వేదికైంది. స్థానిక ఏబీవీ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తుతో పాటు పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించడానికి వెస్ట్‌జోన్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్ వచ్చారు. ఈ సందర్భంగా అక్కడ బందోబస్తు విధుల్లో ఉన్న పాలకుర్తి ఎస్సై మేకల లింగారెడ్డి పరీక్ష కేంద్రం లోపలికి వెళుతున్న డీసీపీని గేటు దగ్గర ఆపి సెల్‌ఫోన్ వెంట తీసుకెళ్లడానికి అనుమతి లేదు సార్ అని తెలిపారు. దీంతో వెంటనే డీసీపీ తన సెల్‌ఫోన్‌ను సదరు ఎస్సైకి అప్పగించి లోపలికి వెళ్లారు. తిరిగి వచ్చిన అనంతరం సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై లింగారెడ్డిని డీసీపీ రాజమహేంద్ర నాయక్ అభినందించారు.

గ్రూప్-2 అభ్యర్థులకు పండ్లు పంపిణీ

జిల్లా కేంద్రంలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో సోమవారం గ్రూప్-2 పరీక్షకు హాజరైన అభ్యర్థులకు లంచ్ సమయంలో కానిస్టేబుల్ రవీందర్ అరటి పండ్లు, మంచినీళ్లు పంపిణీ అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జఫర్‌గఢ్ పీఎస్‌లో పనిచేస్తున్న రవీందర్ గ్రూప్-2 పరీక్ష విధుకు బందోబస్తులో భాగంగా జనగామకు వచ్చారు. పరీక్ష కేంద్రానికి సమీపంలో అభ్యర్థులు ఆహారం తినడానికి ఎలాంటి హోటల్స్, షాప్‌లు లేకపోవడంతో పస్తులుండి మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి నెలకొంది. గమనించిన కానిస్టేబుల్ రవీందర్ పండ్లు, నీళ్లు పంపిణీ చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు కృషి చేయాలని కోరారు.

ఒగ్గు కళాకారుడు ఐలయ్య మృతి

ఐలయ్య (ఫైల్)

బచ్చన్నపేట,.డిసెంబర్ 16 : మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు చెట్టె ఐలయ్య(75) సోమవారం మృతి చెందారు. జిల్లా లోనేగాక రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఒగ్గు కథలతో ఐలయ్య ఇచ్చిన ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకునేవి. ఆయనకు భార్య ఎలమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలంగా ఆనారోగ్యంతో బాధపడుతున్న ఐలయ్య మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయిందని స్థానికులు తెలిపారు. ఐలయ్య మృతికి గ్రామస్తులతోపాటు వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు.



తెలంగాణ మీసేవ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గం

'మీ సేవ' ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా సతీశ్

జనగామ, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ మీ సేవ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఊరడి సతీశ్, ఉపాధ్యక్షులుగా మల్లెల కుమార్, వంగ భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా గజ్జి రాజు, సహాయ కార్యదర్శులుగా ఆకునూరి బ్రహ్మచారి, కొలిపాక సతీశ్, కోశాధికారులుగా ఎండీ పాషా, గాజులపాటి సరోజన, సహాయ కోశాధికారిగా బుల్లె సురేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముసుకు సందీప్, కల్చరల్ సెక్రటరీగా రాయారపు రాజశేఖర్, సలహాదారులుగా నల్ల లక్ష్మీపతి, రాపోలు పృథ్వీ, మహిళా వీఎల్ఈ కో-ఆర్డినేటర్లుగా రచ్చ భవాని, గోనెల పరమేశ్వరి, మీడియా ఇన్‌చార్జిలుగా దేశగాని నాగరాజు, గైని అనిల్ కుమార్, స్పోక్స్‌పర్సన్‌గా పడకంటి భాస్కరాచారి, కార్యవర్గ సభ్యులుగా పొన్నాల శోభన్‌బాబు, రాజ్ కమల్, దుడక మధు కుమార్, వైట్ల యాకయ్య, శాగ వేణుగోపాల్. బోయిని మహేందర్ ఎన్నికైనట్లు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైర శంకర్, ఎండీ మొయిద్ తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేశ్

నియామక పత్రాన్ని స్వీకరిస్తున్న రమేశ్

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 16 : విశ్వబ్రహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని శివునిపల్ల